# ఏదైనాసరే నే కథ రాయాలి

"ఏదైనా సరే, నే కథ రాయాలి."

లేకపోతే లాభంలేదు. బొత్తిగా అన్యాయంగా వుంది. నిన్న మొన్నటి కిష్టిగాడు "చూసుకో నే నో కథ రాశానంటూ" తీసుకు వస్తాడూ? వేలెడంత లేడు, వీరిగాడుకూడా ఒక వస్తాడా? స్కూలుఫైనలు మూడో దండయాత్రకిసిద్ధంగా వున్న చెంచయ్యకూడా ఓ కథకుడే! ఆఖరికి సుధ - నిన్న మొన్నటిదాకా "బావా, టయి మెంత?" అంటూ "ట" కూడ సరిగ్గా పలకలేకుండ అఘోరించిన సుధకి — కథల పోటీలో బహుమతా?

రామ! రామ!

వీళ్లంతా ఈ కథా ప్రపంచంలో హేమాహేమీలుగా చలామణీ అయిపోతూంటే, వీళ్లకంటే కాస్తోకూస్తో నోట్లో ముక్క వున్నవాణ్ని, దాదాపు అర్థ దశాబ్దం సీనియర్‌ని, బి. ఎ. చదువుతూ ఝాంమ్మని ఇంగ్లీషు, తెలుగు రెండింటిలోనూ ఫస్టుమార్కు తెచ్చుకుంటూ, ఉభయభాషా ప్రవీణుడిగా, ఉభయ ఉపన్యాసకులద్వారా మెప్పు పొందుతూన్నవాణ్ని, నేను ఏమీ చేతకానివాడిలాగ చేతులుముడుచుకుని కూచోడమా? అదేదో మహావిద్య అయినట్లు వాళ్లకేసి చేతకానివాళ్లంతా ఆశ్చర్యంగా చూస్తూంటే, నేనుకూడా నోరు వెళ్లబెట్టుకొని చూడడమా?

ఛ ... ఛ....

ఇదేం బాగోలేదు.

నేనూ రాసేస్తా ఓ కథ.

నాకు మాత్రం వాళ్లలాగ చేతుల్లేవా, పెన్నూ కాగితాలూ లేవా?....రాసెయ్యాలి. ఏమైనా సరే కథ రాసెయ్యాలి. అయితే ఒక్క చిక్కు. మంచి కథ రాయాలంటే ఈ పాత పెన్నూ నలిగిన కాగితాలూ ఏం లాభంలేదు. కొత్తవి కావాలి. సరికొత్తవి కావాలి. అవును. మంచి ఉపకరణాలు లేకుండా మంచి కథ ఎలా వస్తుంది? అంచేత వెంటనే బజారుకి వెళ్లి కావలసిన సరంజామా అంతా తీసుకురావాలి తీసుకు వస్తాను.

ఇలా ఓ నిర్ణయానికి వచ్చి వెంటనే బజారుకి వెళ్ళి బాగా ఖరీదైన ఓ పెన్నూ, బాండ్ పేపరు నాలుగుదస్తాలూ, పిన్నుల షీటి ఒహటీ, రెండు మూడు డజన్ల పొడుగుపాటి కవర్లూ, పది నయాపైసల స్టాంపులు డజనూ, వగైరా వగైరా కావలసిన సామానంతా తీసుకొని ఇంటికి వచ్చాడు.

టేబిల్ ముందు కుర్చీలో బాసంపట్టు మఠం వేసుకు కూచుని ఇష్టదేవతా ప్రార్థనచేసి కిష్టిగాడు వీరిగాడు వంటి కుకథికుల నిందా, ఓ హెన్రీ, బాల్‌జాక్ వంటి సుకథకుల స్తుతిచేసీ అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా చెప్పం బూనిన నూతన కథాక్రమం బెట్టెదనిన—

"పవిత్రా గంటన్నరయి కుర్చీకి అలా అతుక్కుపోయావ్? అఘోరించుసల్లే ఉంది వెధవ చదువూ నువ్వూనూ...వడ్డించాను...లే...భోంచేద్దువుగాని" అంటూ ఘట్టిగా వంటింట్లోంచి అమ్మమ్మ అరుపు.

ఆ అరుపులికి హడలిపోయి నా 'మూడ్' కాస్తా ఎగిరి చక్కా పోయింది.

ఛ! ఈ ముసిలాళ్ళకి బుద్ధి ఉండదు. ఎప్పుడూ తిండి - తిండి - తిండి- ఇప్పుడు చూడు బంగారంలాంటి కథ అల్లా ఎలా కరిగిపోయిందో! ఎలాగైతేనేం నానా యాతనా పడి చెదిరిపోయిన కథ తాలూకు అవయవాలన్నీ ఓ చోటుకి పోగుచేసి సూదీ దారంతో కుట్టడానికి ప్రయత్నం చేస్తూంటే "ఏరా! వినిపించడంలే? ఇక్కడ అన్నంమీద ఈగలు ముసిరి పోతున్నాయి. నువ్వు వస్తావా? లేకపోతే నేను లేచివచ్చి ఆ కాగితాలన్నీ ఉండగజుట్టి అవతల పారేసాదా?" అమ్మమ్మ దగ్గర్నుంచి 'అల్టిమేటమ్' వచ్చేసింది.

అంతపనీ చేసినా చెయ్యొచ్చు ఆవిడ. ఇంక లాభం లేదు. ఏదో కాస్త ఎంగిలిపడి వచ్చేస్తే ఆ తర్వాత స్థిమితంగా కథ రాసుకోవచ్చు. ఓ పక్కనుంచి ఆవిడలా గొడవ పెట్టేస్తూ ఉంటే ఇంక కథ నడవడం ఎలా?...అందుకే గొప్ప గొప్ప ఋషులంతా అమ్మమ్మలూ బామ్మలూ లేని అరణ్యాల మధ్యకి పోయి ఇంచక్కా కథలు చెప్పుకుంటూ ఉండేవారు.

నిజానికి కమ్మగా కథ అల్లుకునే ప్రతి సూతుడికీ శౌనకాది మహామునుల్లాంటి చక్కని శ్రోతలున్నా లేక పోయినా, అల్లరీ హడావుడీలేని ఓ ప్రశాంతమైన నైమిశారణ్యమేనా తప్పకుండా ఉండితీరాలి. కథకుడికి కావలసిన ఈ కనీసపు అవసరమైనా లేకపోతే కమ్మని కథలు రాయడం కష్టం.

భోజనం చేస్తున్నంతసేపూ నా మెదడులో ఎన్నో ఆలోచనలు ఈగల్లాగా ముసరసాగాయి. అమ్మమ్మ అరిచిన తర్వాత ఇంక కథ ముందుకి సాగలేదు. సరే, బాగానే ఉందయ్యా - అరవక ముందు ఏం సాగినట్టు? అరవై నిముషాలకి పైగా కుర్చీకి అతుక్కుని కూచున్నాను కదా. ఒక్క అంగుళం అంటే అంగుళం ముందుకు సాగిందా కథ?...నిజమే...మరి చకచకా కథ సాగాలంటే ఎలా?... నల్లేరుమీద బండిలా కథ నడిచిపోవాలంటే ఏం చెయ్యాలి.

ఆఁ!

కథ రాయటానికి ముఖ్యమైన ఆటంకాలు బాహిరమైనవి కావు. ఏవో అంతరమైన కారణాలవల్లే కథ గంతు లేస్తూ పరిగెట్టలేకపోతుంది. అలాంటివి నాలో ఏం ఉన్నాయి చెప్మా! నాలో ఏం లోపంవల్ల కథ నడవడంలేదూ! ఆఁ, నా మొహం - నాలో ఏం లోపం ఉంది?...తక్కిన కథకులకు నేనేం తీసిపోయాను!

ఇలా అనుకుంటూ నాకు తెలిసిన వెంకట్రావుగారి లాంటి ఒకళ్ళిద్దరు ప్రసిద్ధ కవులను జ్ఞప్తికి తెచ్చుకున్నా.

ఆ!...అర్థం అయింది. వాళ్ళంతా ఏదో ఊహా లోకంలో తేలిపోతూ ఉంటారు. ఏ చిన్న సంఘటన చూసినా, ఏ అందమైన సంగతి విన్నా, ఆహా, ఓహో అంటూ తెగ తబ్బిబ్బు అయిపోతూ ఉంటారు. నేను కూడా అలా అవుతూ ఉండాలి.

ఓ మోస్తరు ఉదాసీనత, ఓ చిన్నసైజు పరధ్యానం నేను కూడా ప్రారంభించాలి. అసలు ప్రపంచ విషయాల్లో

పరధ్యానం తెచ్చుకుంటేనేగాని కావ్యప్రపంచంలో పరాకాష్ట నందుకోలేరుట! అన్నట్టు ఈ పరధ్యానంతోపాటు కొంచెం కొంచెం ప్రకృతిలో తన్మయం అవడంకూడా నేర్చుకోవాలి.

అమ్మమ్మకు బాగా కునుకు పట్టిందని నమ్మకం కుదిరాక, రాత్రి బాగా పది దాటాక వీధి తలుపులు బార్లాతీసి, లోపల పడుతూన్న వెన్నెలని చూస్తూ ఆనందించసాగాను.

హమ్మయ్య!

నిశ్శబ్దంతోపాటు ప్రకృతి సౌందర్యంకూడా లభించింది. ఇంక తప్పకుండా కథ రాసెయ్యొచ్చు.

బ్రహ్మాండమైన కథ!

లోకం అంతా ఓహో అనే కథ!

కిష్టిగాడూ పీరిగాడూ వీళ్ళంతా చూసి పైకి మెచ్చుకోకపోయినా లోపల్లోపల ఈర్ష్యపడే కథ!

రైట్ – కథ ఇలా ప్రారంభించవచ్చు.

"బయట వెన్నెల కాస్తోంది" వెన్నెల్లో అందమైన పువ్వులుంటే బాగుండును. ఆఁ!

"సన్నజాజి. మల్లె, చామంతి, బంతి"

ఏడిసినట్టుంది. మల్లె వేసవికాలంలో వస్తుంది. బంతి సంక్రాంతికి విడుస్తుంది. తక్కినవి ఏ కాలంలో పూస్తాయో మనకి తెలియవు. అందువల్ల కథల్లో పువ్వుల ప్రస్తావన చెయ్యడం అంత తేలికైన పనికాదు. అందువల్ల ఆ పంక్తి కొట్టెయ్యాలి – పోనీ.

"బాలభానుడు అస్తాద్రిని చేరుచున్నాడు" అని వర్ణిస్తే? అవును. అది బాగుంది. కాని – 'వెన్నెల కాస్తున్నప్పుడు సూర్యాస్తమయం ఏవిట్రా పిచ్చికన్నా' అని ఎవరేనాఅంటే? ఛట్, బాగోలేదు. వెన్నెలేనా కాయాలి, బాలభానుని ఎం డేనా కాయాలి.

ఆ – కాయులంటే జ్ఞాపకం వచ్చింది. "రంగడికి జామ కాయలంటే ప్రీతి" పోనీ ఇలా మొదలెడితే కథ? ఫస్టుగా ఉంటుంది. కాని, తర్వాత?....తర్వాత ఏం రాయాలి?

ఏవిటో నా మొహం. ఇలా తర్కించుకొంటూ తర్కించుకొంటో రాస్తే కథేం నడుస్తుంది. అలా రాసుకు పోవాలిగాని.

తెల్లని కొంగలు బారులు బారులుగా ఆకాశంలో ఎగురుతున్నాయి. చల్లని పిల్ల తెమ్మెరలు హాయిగా వీస్తు న్నాయి. ఎదురుగా గోదావరి అభిసారికలా నడుస్తూ.

"అమ్మో! నా వేపు ఎవరో నడుస్తూ వస్తున్నారు." అంటూ గట్టిగా అరచి రెండు చేతుల్తోటీ కళ్ళు మూసు కున్నాను.

నిదట్లోంచి కంగారుగా లేచి 'ఏవిట్రా, ఏవిట్రా' కర్ర తీసుకుని నా కెదురుగా బార్లాతీసిఉన్న వీధి గుమ్మం దగ్గరకి వచ్చింది. ఉన్నట్లుండి గట్టిగా నవ్వి 'తెలివి తెల్లవారినట్లే ఉంది. ఎవరిదో గేది, తాడు తెంపుకుని వచ్చింది. దాన్ని చూశా ఈ భయం? అసలీ అర్ధరాత్రివేళ తలుపులు తీసుకుని నిన్నెవరు కూర్చోమన్నారు? లైటు ఆర్పేసి పడుకో'

అంటూ ఓ కసురు కసిరి, తనే తలుపు లేసేసి లైటు ఆర్పేసి వెళ్ళిపోయింది.

నా తలపుల తలుపులు మూసేసినట్లూ నా కథారచనా జ్యోతిని ఆర్పేసినట్లూ బాధపడ్డాను. కిటికీలోంచి పడుతున్న వెన్నెలలోకి బిక్కముహం వేసుకుని చూస్తూ, నేనురాయ బోయే కథ గురించి తీవ్రంగా ఆలోచిస్తూ ఉంటే ఎప్పుడు పట్టేసిందో గాఢంగా పట్టేసింది నిద్దర.

'ప్రారంభించి పరిత్యజింతురు విఘ్నాయత్తులై మధ్యముల్' అన్నట్లు, తర్వాత ఓ నెలదాకా కథరాసే ప్రయత్నమే మానేశా. ఆ మానెయ్యడం మానెయ్యడం పూర్తిగా మానేద్దును. కాని ఇంతలో పరాంకుశంవచ్చి నాలో తిరిగి ఈ చైతన్యాన్ని కల్పించాడు.

వాడు కాలేజీ మేగజైన్ బోర్డులో మెంబరయ్యాడు. మేగజైన్ ఎడ్వయిజరుగా ఉన్న వైస్‌ప్రిన్సిపాల్‌కి వీడు ఎంత చెబితే అంత. అందుకే 'నువ్వో కథ రాయి. మేగజైన్‌లో వేయించే పూచీ నాది' అన్నాడు. పైగా 'ఆ కిష్టిగాడికంటే వీరిగాడికంటే తీసిపోయావేమిటి? వాళ్ళప్పుడే రెండు కథలూ ఇచ్చేశారు" అన్నాడు.

"ఏవిటి అప్పుడే రాయడం ఇచ్చేయడంకూడా అయిపోయిందీ?...అవున్లే - ఛాన్సు ఎప్పుడు దొరుకుతుందా అని కూర్చున్న వాళ్ళు రాసెయ్యరు మరీ - ఊఁ, ఇంతకీ వాళ్ళ కథల పేర్లేమిటి?" అన్నా.

"ఒకటి మధుహృది కాబోలు - రెండోదేమో వ్యధా నిధి అనుకుంటా" అన్నాడు పరాంకుశం.

"అద్గదీ-అలా చెప్పు. శీర్షికలో 'థ' అనే అక్షరం విధిగా రావాలన్నమాట! శీర్షిక నాలుగు అక్షరాల్లోకూడా ఉండాలన్నమాట!... ఇకనేం? వాళ్ళ రహస్యం తెలిసిపోయింది" ఇలా లోపల అనుకొని "ఇంక నేనూ రాసేస్తానులే ఓ కథ" అన్నాను.

"ఎప్పుడు రాస్తావో ఏమో, ఎల్లుండే ఆఖరు రోజు" అన్నాడు పరాంకుశం.

"ఎల్లుండి ఎందుకూ? రేపటికి ఇచ్చెయ్యనూ? అప్పుడే శీర్షికకూడా నిర్ణయం అయిపోయింది. ఏవిటో తెల్సా 'సుధ కథ' - అసలు కిటుకు దొరికిపోయిందిగా? ఇంక కథ రాయడం ఎంతా?"

ఆ సాయంత్రమే ఊరికి బాగా మైలుదూరంలో ప్రశాంతంగా వున్న ఓ తోటలోకి వెళ్ళి కూర్చున్నా. చుట్టూ కొబ్బరి, అనాస, జామి, మామిడిచెట్లు అన్నీ చూడ్డానికి ఎంతో అందంగా ఉన్నాయి. చిలుకలు జామిపళ్ళు కొరికి కింద పడేస్తూ చక్కగా ఒకదానితో ఒకటి వాళ్ల తియ్యని భాషలో మాట్లాడుకుంటున్నాయి. ఉండుండి దూరంగా మామిడిచెట్టు మీంచి కోకిల కూస్తోంది.

ఆహా ఎంత చక్కని వాతావరణం!

కథ రాయడానికి ఎంత అనువైన సామాగ్రి దొరికింది!

నా కథలో కోకిల గురించికూడా ఇంచక్కా రాయొచ్చు. మహాకవుల్లో ఎవ్వరూ కోకిల గురించి రాయకుండా మానలేదు.

మహాకవులంటే జ్ఞాపకం వచ్చింది. కాళిదాసు ఎంత గొప్పకవి! ఆయన శాకుంతలం, మేఘసందేశం గొప్ప కావ్యాలంటారు. అవి గొప్పవి అయాయంటే బహుశా ఆయనా కావ్యాలను ఇలాంటి తోటలలోనే కూర్చుని రాసి ఉండాలి. నేను కూడా అపర కాళిదాసులా 'సుధకథ'ని రాసేస్తా.

మహ బాగా ఎన్నుకున్నాను కదూ ఈ శీర్షిక. ఇటు కావలసిన 'థ' వచ్చింది. అటు మా మరదలు సుధపేరూ వచ్చింది. దాన్ని నాయికనుచేసి, నేను నాయకుడుగా ఆ కథ రాయాలి. అందులో అది ఓడిపోయినట్లూ నేను విజయం సాధించినట్లు రాశానా ఇంక చూసుకో - ఎంత ఏడుస్తుందో!

ఏడవవలసిందే! లేకపోతే తానే గొప్పదాన్నయినట్లు కథలు రాయడం, బహుమతులు సంపాదించడం, అక్కడికి తక్కిన వాళ్ళెవళ్ళూ తనకి చాలనిన్నట్లు గర్వంగా అందరికేసీ చూడ్డం. దాని గర్వం ఏవిటో ఈ మాటుతో తేలిపోవాలి! నా కథ చదివేసరికి దాని తల తిరిగిపోయి గర్వం అంతా ఒక్క దెబ్బతో దిగిపోవాలి. లేకపోతే తనొక్కతే మహా కథ రాయగలననుకుంటోంది. ఆ అనుకోవడం తప్పని నిరూపించాలి. ఏమైనా సరే నే కథ రాసితీరాలి!

ఓ చిత్తు కాగితంతీసి విఘ్నేశ్వరా, సరస్వతీ, వెంక

ఈశ్వరా అని మూడేసిసార్లు రాసి కళ్ళ కద్దుకున్నాను. నెల్లాళ్ళ క్రితం కథ రాయబోయేముం దిలా దేవుళ్ళ పేర్లు రాసిన జ్ఞాపకం లేదు. అందుకే కథ నడవలేదు. ఏదో ఒక అడ్డంకి వచ్చింది. ఇప్పుడా భయంలేదు. దేవుళ్ళ పేర్లు రాస్తే శానుగా? కథ చకచకా సాగిపోతుంది.

కాగితాలో మూరు కుదించి అందంగా బొత్తిపెట్టి 'పిన్' చేశాను. 'సుధకథ' అని పెద్ద అక్షరాలతో ఎర్ర సిరాలో హెడ్డింగుపెట్టి అందంగా నల్లసిరాతో షేడ్ ఇచ్చాను. ఆ క్రింద గుండ్రంగా నా పేరు రాశాను. రాయబోయే కథకి అలంకారాన్నీ అందాన్నీ కూర్చేలా ముచ్చటగా తయూరయింది హెడ్డింగు.

ఇంక కథే మొదలెట్టాలి. మెదడులో ఎన్నో ఆలోచనలు ఉన్నాయి. ఎంతో అందమైన ఇతివృత్తం ఉంది. చక్కని భాష ఉంది. వీటిఅన్నిటి సహాయంతో అప్పుడే నా మనస్సులో అత్యద్భుతమైన కథ తయూరయిపోయింది. నిజంగా నామనస్సుని చదవగలిగిన పాఠకుడే ఉంటే నన్ను ఆకాశానికి ఎత్తి ప్రపంచ కథానికా రచయితల శ్రేణిలో కూర్చోబెట్టి ఉండును.

అంత గొప్ప కథ మెదడులో ఉండికూడా ఎందువల్లో కాగితంమీద ఏమీ పెట్టలేకపోతున్నా. అథవా ఏవో ఒకటి రెండు పంక్తులు రాసినా, అవి నా భావంలో ఉన్న బరువుని తేలేకపోయూయని ఇట్టే తెలిసిపోతోంది. ఇలా ఎంతకు జరుగుతోంది.

ఆలోచించే మెదడునాది-రాసే చెయ్యికూడా నాదే! మరి ఈ రెండింటికీ పొంతన ఎందుకు ఉండటంలేదు? బహుశా మధ్యలో పెన్ను కొంత కుట్ర చేస్తోందేమో! నెల్లాళ్ళకితమే కదూ బోలెడు డబ్బుపెట్టి కొన్నానుదాన్ని?

కొంటే మాత్రం? ఖరీదు అయితే ఉందికాని కవిత్వం రాసే అలవాటు సామర్థ్యం ఉండొద్దూ? లక్షలకి లక్షలు డబ్బున్న వాళ్ళల్లో తెలివితేటలు లేనివాళ్ళు ఎంతమంది లేరూ? అలాగే ఈ కలమూను.

అందువల్ల ఈ కలం లాభంలేదు. కవిత్వాన్ని రాయడం అలవాటున్న కలాన్ని సంపాదించాలి. అలాంటి కలం అయితేనా, మన ఆలోచనల్ని చక్కగా కాగితంమీద పెడుతుంది. ఈ ఊళ్ళో అలాంటి కలం ఉన్న వాళ్ళు ఎవరున్నారు చెప్మా?

ఆఁ – ఎవర్నో ఎందుకు? సుధనే అడుగుదాం. నీ పెన్ను ఓమాటు యిమ్మని. మొన్న తనకి ప్రైజు సంపాదించి పెట్టింది ఆ పెన్నేగా? ఈ ఆలోచన రావడం తడవుగా అవతల వీధిలో వున్న మా మావయ్యగారింటికి వెళ్లాను. సుధ ఊరెళ్లిందట. మళ్ళీ ఆదివారం దాకా రాదట అలమారంతా వెదికినా దాని కలం కనిపించలేదు. తనతో ఆ వూరు పట్టుకెళ్లిందేమో. పొరుగూరు పోయేటప్పుడు కలం ఎందుకు మొద్దుమొహం కాకపోతే?

ఇంతకీ నేను కథపూర్తిచేసే యోగంలేదు. తర్వాత పరాంకుశం ఆఖరి సారిగా కూడా అడిగి వెళ్ళి పోయాడు. వాడలా పోతూంటే నాకు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

కొన్నాళ్ళయ్యాక ఓ రోజున స్టూడెంట్స్‌కి అందరికీ మేగ్‌జైన్ కాపీలు ఇస్తారని తెలిసి ఆ రోజున కాలేజీకి శెలవు పెట్టి ఇంట్లో తలదాచుకున్నా - సాయంత్రం నా ప్రాణానికి యములాళ్ళలా వచ్చారు కిష్టిగాడూ పీరిగాడూను మా యింటికి. వస్తూనే 'మా కథలు చూశావురా' అన్నారు. నాకు బాధా దుఃఖం ఒక్కసారిగా ముంచుకొచ్చాయి. వాటితో పాటు వాళ్ళమీద అసహ్యంకూడా వేసింది. 'నువ్వు చెయ్య లేని పని మేం ఎంతబాగా చెయ్యగలమో చూశావా' అన్న గర్వరేఖ కూడా నాకా మాటలో గోచరించింది.

అందుకే వెంటనే అన్నాను "ప్చ్-ఆఁ! వంద కథల్లో మీ దొకటి" అని.

నా మాట వాళ్ళకి గట్టిగా తగిలినట్టుంది "అహా! అల్లాగేం? అయితే నువ్వొకటి రాయిచూద్దాం" అన్నారు.

"అదేం బ్రహ్మ విద్యటరా?" అన్నా.

"బ్రహ్మ విద్యోకాదో! నువ్వొకథరాసి ఏ పెద్ద కథ కుడి చేతనయినా ఇదిమంచికథ అనిపించు. మేం కథలు రాయడం మానేస్తాం-ఏం? ఇదే పందెం" అన్నారు.

నాకు వాళ్ళ పందెం చూస్తే వళ్ళు మండుకొచ్చింది. అంటే వీళ్ళ ఉద్దేశం ఏవిటి? నేను కథ అయినా రాయలేని ఒట్టి చవటననేకదా? వీళ్ళకింతకింతా పొగ రణచాలనుకున్నా. "సరే అలాగే-మనకి మధ్యవర్తి ఎవరు? అన్నా-"

"మొన్న ప్రైజువచ్చిన సుధ" అన్నాడు కిష్టిగాడు.

"నేను ఒప్పుకోను-ప్రముఖ పత్రికల్లో తరుచు కథలు రాసే వెంకట్రావుగారు"

"సరే అలాగే కానియ్యి" అంటూ వాళ్ళు వెళ్ళిపోయారు.

తర్వాత నేను ఎన్నికథలు చదివానో, ఎన్ని దస్తాల కాగితాలు పాడుచేశానో, ఎన్ని రాత్రులు టీ తాగి మెళుకువుగా ఉండి ఆలోచనలతో మతిపోగొట్టు కొన్నానో ఆ దేవుడికే తెలియాలి. చూసిన ప్రతి మనిషిమీదా కథ రాయాలనీ, విన్న ప్రతి సంఘటనా కథకి పనికి వస్తుందనీ, పుస్తకాలలో చదివిన ప్రతి వర్ణనా నా కథలలో ఉపయోగించుకోవచ్చనీ, అవన్నీ ఒక పెద్ద బౌండు బుక్కులో నోట్ చేశాను. బౌండుబుక్ పేజీలు నల్లబడుతున్నాయి కాని తెల్లకాగితం మీద కథమాత్రం కదలడంలేదు.

లాభంలేదు - కథలు రాయడం అలవాటున్న కలం కావాలి. ఓ రోజు వెళ్ళి సుధ కలం వేరే ఏదో పని ఉందని వంక పెట్టి పట్టుకొచ్చా - ఆలోచించకూడదు - ఏదివస్తే అది రాసెయ్యాలి. రాసినది ఏపరిస్థితిలోనూ కొట్టెయ్య కూడదు. అలాగని కలం ఆపకూడదు. కళ్ళుమూసుకుని రాసెయ్యడమేపని. ఇలా గట్టిగా ఒట్టు పెట్టుకుని మొండిగా మొదలెట్టేశాను.

ఆశ్చర్యం!

అర్ధరాత్రి దాటకుండా కథ పూర్తిఅయింది. నా ఆనందానికి అంతులేదు. నేను కథ రాసేశాను-ఇకముందు ఎన్నో

రాసేస్తాను. కథకుడిగా నాకు పెద్దపేరు వచ్చేస్తుంది. అప్పుడు కిష్టిగాడూ వాళ్ళూ – ఆఁ! వాళ్ళ మొహం! ఇంక వాళ్ళేం రాయగలరు? పందెం ప్రకారం వాళ్లు మానెయ్యాలిగా?

మర్నాడు అనుకున్న ప్రకారం ముగ్గురం వెంకట్రావు గారి దగ్గరకి వెళ్లాం. నేను కథ చదివాను.

నేనూ సుధా చిన్ననాటి స్నేహితులం. పక్కింటి శాస్త్రిలుగారి ఇంట్లో దొంగతనంగా జామకాయలు కోసుకోవడం, అవి పంచుకోవడంలో తగువులాడుకోవడం, మళ్లా స్నేహితులంకావడం ఇలాకొన్నాళ్ళు జరిగింది–ఓ రోజున సుధా వాళ్ళ నాన్నగారికి ట్రాన్స్ఫరయి సుధ వెళ్ళిపోతూంటే నాకు కోపంవచ్చి పోతేపో నీ జతపచ్చి – ఇంచక్కా వానూనేనూ జత అన్నా–సుధ ఏడుస్తూ వెళ్ళిపోయింది. ఆ తర్వాత నాకూ ఏడుపు వచ్చింది. వాసు జతకూడా మానేసి నాతో నే నే జతగాఉండడం మొదలెట్టా–

ఇదీకథ–

"ఎలా ఉందండీ?" అన్నా–

"వెంకట్రావుగారు ఓచిత్రమైన నవ్వు నవ్వారు. అంత కంటే ఏం మాట్లాడలేదు."

"నిజంగా మంచికథ కదండీ!" అన్నా.

ఆయన కొంచెంసేపు ఇబ్బందిపడి "కొన్నాళ్ళు ఏదో అలా రాస్తూ ఉండు. ఎప్పటికేనా కథలు రాయగలవు" అన్నారు.

నేను ఆ రోజున ఆయన్ని పెట్టిన ఇబ్బంది ఏమిటో ఇప్పుడు నాకు అర్థం అయింది. మా మూడేళ్ళ బాచిగాడు సీసామూతతో తడి ఇసుక నొక్కి అచ్చులువేసి అరుగుమీద పేరుస్తూ "బిసకత్తులు నాన్నా! తిను-తిను" అంటూ గంటనుంచి బాధపెడుతున్నాడు నన్ను.

పాపం అప్పుడు వెంకట్రావుగారు కూడా నా వల్ల ఇలాంటి బాధేపడి ఉంటారు. ఆయన్ని బాధ పెట్టడమే మిగిలింది. కాని నేను అప్పటికీ ఇప్పటికీ కథేరాయలేక పోయాను.

ఏమైనాసరే నే కథ రాయాలి!